తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం
04 జూన్ 2026
పేజీలు : 8



# బీఆర్ఎస్ పార్టీ గూటికి గోలి నరేందర్ రెడ్డి..?

○కాంగ్రెస్ లో ప్రాధాన్యత దక్కక పోవడంతో పార్టీ వీడిన గోళి
○కొనసాగుతున్న ఇరు పార్టీల బుజ్జగింపుల పర్వం
○ఎమ్మెల్యే కుంభం గెలుపులో కీలకపాత్ర వహించిన గోళి

**బీబీనగర్ (జనంసాక్షి):**
బీబీనగర్ మండలంలో కాంగ్రెస్ నాయకులకు ముందస్తుగా పదవులు నిర్ణయించడం పట్ల పార్టీ లోని అసమ్మతి రాగాలు పెరుగుతూ వస్తున్నాయి. ఫలితంగా పార్టీ నుంచి ఒక్కొక్కరు విడుతూ వస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోళి నరేందర్ రెడ్డికి పార్టీలోని తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న మనస్థాపంతో ఇటీవల కాంగ్రెస్ పార్టీని వీడారు. దీంతో పట్టణంలోని కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు విషయంలో ఎదురుదెబ్బ తగిలినట్లు అయింది. 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గెలుపుకు గోలి నరేందర్ రెడ్డి పట్టణంలో కీలక పాత్ర వహించడంతో పట్టణంలో మెజార్టీ ఓటు బ్యాంకు వచ్చింది. దీంతో నరేందర్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు సైతం లభించింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్ సభ్యులను నామినేటెడ్ పద్ధతిలో ఎంపిక చేయాలని గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ దిశగా మండలంలోని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కేటాయించడంలో ఎమ్మెల్యే నిర్ణయం తీసుకుని చైర్మన్ గా పొట్టోల్ల శ్యామ్ గౌడ్, వైస్ చైర్మన్ గా ఇటీవల కాంగ్రెస్లో చేరిన కొండమడుగు గ్రామానికి చెందిన వాకిటి చంద్రశేఖర్ రెడ్డిల పేర్లను ఖరారు చేసి జాబితా పైకి పంపినట్లు సమాచారం. దీంతో అప్పటికే చైర్మన్ పదవిని ఆశించిన నరేందర్ రెడ్డికి నిరాశే మిగిలింది. పార్టీకి ఏళ్ల తరబడి సేవ చేసిన తనకు చైర్మన్ పదవి ఇవ్వకపోయినా కనీసం వైస్ చైర్మన్ పదవి అయినా ఇవ్వాలని నరేందర్ రెడ్డి ఎమ్మెల్యేను కోరినట్లు సమాచారం. అయినప్పటికీ నరేందర్ రెడ్డికి ఎలాంటి హామీలు లబించకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనైనట్లు సమాచారం. అంతకు ముందే మండల పార్టీ అధ్యక్షుడు పదవి కోరిన పాత అధ్యక్షనే కొనసాగిస్తానని చెప్పడం తనను విస్మరించడం పై తీవ్ర మనోవేదన గురై ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే అదును గా భావిస్తున్న బీఆర్ఎస్ పార్టీ పట్టణంలోని మంచి పట్టున్న నాయకుడిగా ఉన్న నరేందర్ రెడ్డిని కారు ఎక్కించేందుకు ప్రధాన నాయకులు ప్రయత్నిస్తున్నారు. 2018 లో సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన స్వల్ప తేడాతో ఓడిన గోలి నరేందర్ రెడ్డి తదుపరి ఎంపిటిసి ఎన్నికల్లో పట్టణంలోని 1000 ఓట్ల పైచిలుకతో భారీ మెజార్టీ సాధించాడు. దీంతో పట్టణంలోని ప్రధాన నాయకుడిగా నిలిచిన నరేందర్ రెడ్డిని తిరిగి కాంగ్రెస్ లోకి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే బుజ్జగింపుల పర్వం కొనసాగిస్తున్నట్లు సమాచారం. అదే తరహాలో బీఆర్ఎస్ నాయకులు సైతం నరేందర్ రెడ్డి కి పార్టీలో ఉన్నత స్థానాన్ని కల్పించడంతోపాటు ఉన్నత పదవిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పార్టీలో చేరాలని కోరుతున్నట్లు సమాచారం. దీంతో నరేందర్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరేనా, లేక తిరిగి కాంగ్రెస్ లోకి వెళ్లేనా అనేది పట్టణంలోని చర్చనీయంగా మారింది.



నామినేటెడ్ ఎంపికపై నాయకుల అసంతృప్తి: పిఏసిఎస్ నామినేటెడ్ సభ్యుల పదవుల ఎంపికలో మండలంలోని సీనియర్ నాయకులను ఎవరిని సంప్రదించకుండా కేవలం ముగ్గురు నలుగురు నాయకులతో కలిసి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ఏకపక్ష నిర్ణయం తీసుకున్నట్లు, దీంతో ఇతర సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం శ్రమించిన నాయకులను కాదని పార్టీలోకి కొత్తగా వచ్చిన ఆర్థిక బలంతో ఉన్న నాయకులకు, వెన్నుపోటు పొడిచిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని కార్యకర్తలు తీవ్ర ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక గ్రామసభలో గందరగోళం

### గ్రామసభకు మేళ్లచెరువు తహసిల్దార్ రాజేందర్ రెడ్డి గైర్హాజరు

### తహసిల్దార్ గైర్హాజరు పై రైతులు ఆగ్రహం

**మేళ్లచెరువు, (జనంసాక్షి):**
మండలంలోని మేళ్లచెరువు గ్రామంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక గ్రామసభలో గురువారం గందరగోళం నెలకొంది. గ్రామసభకు మేళ్లచెరువు తహసిల్దార్ రాజేందర్ రెడ్డి గైర్హాజరు కాగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేనెంబర్ 1057లో 185 మంది రైతులకు చెందిన 220 పట్టాభూములను నిషేధిత జాబితాలో రెవిన్యూ అధికారులు పెట్టారని రైతులు ఆరోపించారు. మా పట్టా భూములను ఎందుకు నిషేధిత జాబితాలో పెట్టారంటూ రెవిన్యూ ఇన్స్పెక్టర్ బాబాను రైతులు వివరణ కోరారు. తహసిల్దార్ ఎందుకు గ్రామ సభకు హాజరు కాలేదని రైతులు అడగగా తాను బయట ఉన్నానంటూ సమాధానం ఇచ్చిన తహసిల్దార్ రాజేందర్ రెడ్డి. తహసిల్దార్ గైర్హాజరు పై రైతులు ఆగ్రహం రెవిన్యూ ఇన్స్పెక్టర్ బాబా పై రైతులు గొడవ దిగారు. రైతుల పట్టా భూములను 22?ఏ నిషేధిత జాబితా నుండి తొలగించాలని వారు ఆందోళన వ్యక్తం చేశారు.



## నిజాయితీ చాటిన యువకులు

**వలిగొండ, జూన్ 4 (జనంసాక్షి)**
మండలంలో ని టేకులసోమారం గ్రామానికి చెందిన నరగొని మురళి, చేగూరి వంశీ రాజ్ నిన్న రాత్రి భువనగిరి ఫంక్షన్ కు పోయి ఇంటి వస్తున్న సందర్భంలో నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్ దాటగానే రోడ్డు పక్కన పడి ఉన్న ఫోనును గమనించిన వారు గురువారం వలిగొండ పోలీసులకు అప్పగిచ్చారు. పోలీసులు యువకుల నిజాయితీని అభినందించారు.



# తెలంగాణ గేమ్ చేంజర్ గా ఆయిల్ ఫాం సాగు

## సాకారమైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కల


**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 4 (జనంసాక్షి)**
ఆయిల్ ఫామ్ సాగులో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ నేషనల్ మిషన్ ఆన్ ఏడిబుల్ ఆయిల్స్ పథకంలో మొదటి స్థానంలో తెలంగాణ జాతీయ ఆయిల్ ఫామ్ సాగులో 36 శాతం తెలంగాణ వాటా.తెలంగాణ లో 1.16 లక్షల హెక్టార్లలో 79 448 మంది రైతులు పామాయిల్ సాగు టన్ను పామాయిల్ గెలలు ధర 23,501తెలంగాణ గేమ్ చేంజర్ గా ఆయిల్ ఫామ్ సాగు.ఆయిల్ ఫామ్ సాగుకు బాటలు వేసిన మంత్రి తుమ్మల ఎన్టీఆర్ హయంలో పామాయిల్ సాగుకు శ్రీకారంచుట్టిన మంత్రి తుమ్మలచంద్రబాబు కేసీఆర్ పాలనలో పామాయిల్ సాగు విస్తరణ బాటలు వేసిన మంత్రి తుమ్మలసీఎం రేవంత్ పాలనలో యావత్ దేశానికే ఆయిల్ ఫామ్ హబ్ గా తెలంగాణ రైతే రాష్ట్ర మంత్రి గా ఉంటే ఏమి జరుగుతుంది అనే ప్రశ్నకు నిలువెత్తు నిదర్శనం మంత్రి తుమ్మల.మంత్రులంటే కాంట్రాక్టులు కమిషన్లు భూదందాలు చేసే వాళ్లను చూసాం.కానీ రైతు బిడ్డ రైతైన తుమ్మల నాగేశ్వరరావు 1986 లో ఎన్టీఆర్ క్యాబినెట్ లో మంత్రిగా అవకాశం దక్కితేభద్రాద్రి సీతారామ చంద్ర స్వామి వారి ఆశీస్సులు తో మంత్రి పదవి ప్రజా సేవ కోసమే అంటున్న తుమ్మల.



# విషపూరిత ‘ఎక్స్‌పైరీ’ వ్యాపారం!

○సామాన్యుల ఆరోగ్యంతో చెలగాటం○ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
○పేద గిరిజనులు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా అక్రమ విక్రయాలు?

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 4 (జనంసాక్షి)**
అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయం యథేచ్ఛగా కొనసాగు తుండటంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడు తోంది. కొన్ని దుకాణాల్లో ఎక్స్‌పైరీ డేట్ పూర్తయిన బిస్కెట్లు, చాక్లెట్లు, పానీయాలు, ఇతర ఆహార ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. ఈ పరిస్థితి వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పలు దుకాణాల్లో విక్రయిస్తున్న ఆహార పదార్థాలపై ఉన్న గడువు తేదీలను పరిశీలిస్తే అవి ఇప్పటికే ముగిసినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా పేద గిరిజన ప్రాంతాల ప్రజలు, చిన్నారులు, అవగాహన తక్కువగా ఉన్న వినియోగదారులే ఈ మోసానికి బలవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారిపై మరింత తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.




ఆహార భద్రతా నిబంధనల ప్రకారం గడువు ముగిసిన వస్తువులను విక్రయించడం చట్టవిరుద్ధం. అయిన ప్పటికీ మండల కేంద్రంలో ఇటువంటి విక్రయాలు కొనసాగుతుండటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించా ల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండల అధికారులు, ఫుడ్ సేఫ్టీ శాఖ సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, గడువు ముగిసిన వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ప్రత్యేక వార్డు సభలు



**హాలియా, జూన్ 4 జనంసాక్షి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. పురపాలక సంఘం చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షతన 1, 2, 3 వార్డుల సభలను హాలియా పబ్లిక్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పట్టణంలో పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రధాన రహదారుల వెంట చెత్త తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి జనపనార, వస్త్రాలతో తయారైన సంచులను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఇందిరమ్మ గృహాల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగు తుందని పేర్కొన్నారు. పురపాలక కమిషనర్ కె. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడి, పరిశుభ్రత సంబంధిత వ్యర్థాలు, ప్రత్యేక సంరక్షణ అవసరమయ్యే వ్యర్థాలుగా వేరు చేయాలని సూచించారు. కొత్తగా గృహాలు నిర్మించేవారు వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక వార్డు సభల కరపత్రాలను విడుదల చేసి ప్రజలకు పంపిణీ చేశారు.

పురపాలక ఉపాధ్యక్షుడు రాజా రమేష్ యాదవ్ పట్టణ సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, వార్డు ప్రజల నుంచి పలు వినతులు, ఫిర్యాదులను అధి కారులు స్వీకరించారు. కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ కుందూరు వెంకటరెడ్డి, మండల వ్యవసాయ అధికారి, పట్టణ ప్రముఖులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, మహిళలు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# పినపాక మండలంలో గాలివాన బీభత్సం..

## దెబ్బతిన్న 29 ఇళ్లు



**పినపాక, జూన్ 04 (జనంసాక్షి):** పినపాక మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈ బయ్యారం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 17 ఇళ్లు, ఎలిసిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 12 ఇళ్లు దెబ్బతిన్నాయి. పలుచోట్ల భారీ చెట్లు విద్యుత్ స్తంభాలపై కూలిపోవడంతో స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విపత్తు సమాచారం అందుకున్న వెంటనే ఈ బయ్యారం సర్పంచ్ చంద్రరావు, ఎలిసిరెడ్డిపల్లి లో స్థానిక నాయకులు సత్తిబాబు ఆధ్వర్యంలో సహాయక చర్యలు ప్రారంభించారు. గాలివాన కారణంగా నష్టపోయిన ఇళ్లను స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఇక ఈ బయ్యారం ప్రధాన రహదారిపై పంచాయతీ కార్యాలయం సమీపంలో సుమారు అర కిలోమీటర్ మేర భారీ చెట్లు రోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాంగ్రెస్ నాయకుడు గంగిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో చెట్లను తొలగించి రహదారిని పునరుద్ధరించారు. దీంతో వాహనాల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. అధికారులు నష్టంపై అంచనా వేస్తూ బాధితులకు సహాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఎలిసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో బాధిత కుటుంబాలకు స్థానిక నాయకులు సత్తిబాబు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యుత్ శాఖ అధికారులు నూతన స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్తును పునరుద్ధించేందుకు కృషి చేస్తున్నారు.



# ఎర్రగుంట ఆసుపత్రిలో తాగునీటి సౌకర్యాలు కల్పించాలి

### ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన జిల్లా కౌన్సిల్ సభ్యుడు దేవి బాల కిరణ్ శర్మ

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 4 (జనంసాక్షి)** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం అత్యవసరమని బీజేపీ నాయకుడు జిల్లా కౌన్సిల్ సభ్యుడు దేవి బాల కిరణ్ శర్మ అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట ప్రధాన ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆసుపత్రిలో బోరు వేసి కనీస నీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యేకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవి బాల కిరణ్ శర్మ మాట్లాడుతూ, ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది రోగులు వస్తున్నప్పటికీ తాగునీటి సౌకర్యం సరిగా లేకపోవడం బాధాకరమన్నారు. వేసవి కాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా మారిందని, వెంటనే శుద్ధి చేసిన తాగునీటి ప్లాంట్, వాటర్ కూలర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రిలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలని, ఎమ్మెల్యే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన చర్యలు తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చెర్లగూడెం భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి :సీఎంకు మహేష్ గౌడ్ లేఖ

**మర్రిగూడ, జూన్ 04(జనంసాక్షి)** చెర్లగూడెం ప్రాజెక్టు భూనిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మాదగోని మహేష్ గౌడ్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గురువారం ఆయన ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో... చెర్లగూడెం ప్రాజెక్టు నిర్మాణం కోసం వందలాది కుటుంబాలు తమ సొంత ఇళ్లు, వ్యవసాయ భూములు ప్రభుత్వానికి అప్పగించి సర్వస్వం త్యాగం చేశాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయి 10 సంవత్సరాలు గడుస్తున్నా, అర్హులైన భూనిర్వాసితులకు చట్ట ప్రకారం అందవలసిన పునరావాస ప్యాకేజీ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిర్వాసిత కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నాయని, ప్రజా ప్రభుత్వం వచ్చాక తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో బాధితులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ నిధులను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేయాలని, భూమి, ఇళ్లు కోల్పోయిన ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి పూర్తి స్థాయిలో పరిహారం అందేలా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని, నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించాలని లేఖలో ముఖ్యమంత్రిని కోరారు. మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో ఉన్న చెర్లగూడెం భూనిర్వాసితుల కష్టాలను స్వయంగా పరిశీలించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

### మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి



**నేరేడుచర్ల, జూన్ 04 (జనంసాక్షి)** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా పురపాలక సంఘ పరిధిలోని అన్నీ వార్డులలో వార్డు సభలు నిర్వహించుటకు గాను,సూర్యాపేట జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుగుణంగా పురపాలక సంఘ పరిధిలో జూన్ 04, 06,08,మరియు 10 తేదీలలో వార్డు సభలు ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయంతో నిర్వహించుటలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలో ని 1,7,8 వార్డులలో కలిపి మరియానంద స్కూల్ నందు వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సిహెచ్. నాగరాజు మాట్లాడుతు..ఇంకుడ గుంతల నిర్మాణాలు, స్వచ్ఛ సర్వేక్షన్ తడి చెత్త పొడి చెత్త వేరు చేయు విధానము వనమహోత్సవము, త్రాగు నీరు, రాబోయే వర్షా కాల దృష్ట్యా తీసుకోవలిసిన చర్యలు మరియు పట్టణ పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 01 07,08 , వార్డు కౌన్సిలర్లు, రవి నాయక్, వాసా జ్యోతి, తాళ్ల లావణ్య సురేష్ రెడ్డి, 09 వార్డు కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ రణపంగ నాగయ్య,మాజీ సర్పంచ్ చింతమల్ల సైదులు, మాజీ ఎంపీటీసీ కాసాని సైదులు,కార్యాలయ సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కొరకే వార్డు సభలు

### వార్డు సభల ద్వారా ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన

**దేవరకొండ, జూన్ 04(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక"పర్యావరణ వారోత్సవము" కార్యక్రమములో భాగంగా గురువారం మూడో వార్డు శాలి బండ లో వార్డుసభ సమావేశము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ అంకిరి సుమలత రాజేష్ 3వ వార్డు సూపర్వైజర్ శంకర్ గౌడ్ ల అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక చైర్పర్సన్ పూన్న శైలజ, మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. చైర్ పర్సన్ శైలజ మాట్లాడుతూ పర్యావరణ, పారిశుద్ధ్యం పరిశుభ్రత, ఇంకుడు గుంతలు ఏర్పాటు గురించి ప్రసంగించారు. రాబోవు వర్షాకాలం సన్నద్ధతలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఇండ్ల తొలగింపు మరియు రోడ్ల వెంట నీరు నిల్వ ఉండకుండా, కంపచెట్ల తొలగింపు, మురికి కాలువలు పూడిక తొలగింపు గురించి మరియు రాబోవు వర్షాకాలంలో వర్షస్థాయి తక్కువగా నమోదు అవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు తెలియజేయడం వలన ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రామ దుర్గా రెడ్డి మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలలో చెత్త వేయకూడదని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యలకు సహకరించాలని ప్రజలకు సూచించారు. అలాగే తాగునీటిని మరిగించి తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పోలవరం బ్యాక్ వాటర్ ముంపు బాధితులకు న్యాయం చేయాలి

❍ ప్రభావిత గ్రామాల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి ❍ పీపీఏ బృందాన్ని వేర్వేరుగా కలిసి చర్చించిన ఎమ్మెల్యేలు

**బూర్గంపహాడ్ జూన్ 04 (జనంసాక్షి)**

పోలవరం బ్యాక్ వాటర్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని... ప్రభావిత గ్రామాల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులు వేర్వేరుగా పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ బృందం) ను కలిసి చర్చించారు. తొలుత పాయం పీపీఏ సీఈఓ సంజీవ్ నందన్ సహాయ్ ను కలిసి పోలవరం బ్యాక్ వాటర్ వల్ల పినపాక నియోజకవర్గంలో అశ్వాపురం, బూర్గంపహాడ్ ప్రాంతాల్లో ముంపు పరిస్థితులను వివరించి వారికి న్యాయం చేయాలని కోరారు. గ్రామాల్లో వ్యవసాయ భూములు, ప్రజల జీవనోపాధి, మౌలిక సదుపాయాలకు ఏర్పడుతున్న ముప్పుపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలతో పాటు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం తదితర గ్రామాలు పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయని అధికారిక అంచనాల కంటే వాస్తవ పరిస్థితుల్లో మరింత విస్తీర్ణంలో వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వందల కుటుంబాలు నిర్వాసితులయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ భద్రతకు కూడా భవిష్యత్లో వరదముప్పు వాటిల్లే అవకాశం ఉందని పీపీఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభావిత ప్రాంతాల్లో సమగ్ర శాస్త్రీయ బ్యాక్ వాటర్ సర్వే నిర్వహించి పునరావాస, పునఃనిర్మాణ ప్యాకేజీ ప్రకటన చేయడం, భూములు కోల్పోయే రైతులకు న్యాయపరమైన పరిహారం, ఉపనదులపై బ్యాక్ వాటర్ ప్రభావ అధ్యయనం చేపట్టడం, శాశ్వత వరద నియంత్రణ చర్యలు అమలుచేయడం, రక్షణ కరకట్టలు, ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించడం వంటి డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పీపీఏ సీఈవోను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం పోలవరం ముంపు ప్రభావిత ప్రాంతాల సర్వేకు సంబంధించిన అంశాలపై చర్చించారు. పోలవరం బ్యాక్ వాటర్ తో భద్రాచలంలో ముప్పు వాటిల్లే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని సర్వేను పారదర్శకంగా నిర్వహించి ముంపు ప్రాంతాల్లో ఏ మేరకు ప్రభావం ఉంటుంది. ఎలాంటి చర్యలు చేపట్టాలో కేంద్రానికి నివేదిక ద్వారా వివరించాలని కోరారు. ముంపు ప్రాంతాల బాధితులకు మెరుగైన పరిహారం, ప్యాకేజీ ఇవ్వడంతో పాటు శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే భద్రాచలం వద్ద కరకట్ట నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ కిషోర్నాయక్, ఐఎన్టీయూసీ నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి, వేజ్బోర్డు మెంబర్ యారం పిచ్చిరెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, భజన ప్రసాద్, ఎడమకంటి సుధాకర్ రెడ్డి, వారాల వేణు, ఇంగువ రమేష్, చంటి, ఐఎన్టీయూసీ యూత్ జిల్లా అధ్యక్షులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భద్రాచలం నాయకులు భీమవరపు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





- అఖిలపక్షం ఆధ్వర్యంలో పీపీఏ కు వినతిపత్రం

బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులు పోలవరం ప్రాజెక్టు అథారిటీ బృందం అధికారులను సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. పోలవరం ఎత్తు పెంపుతో బూర్గంపహాడ్ గ్రామానికి పొంచి ఉన్న ముప్పుపై పోలవరం అథారిటీ అధికారులకు వివరించారు. దీనికి స్పందించిన అధికారులు ముంపునకు గురయ్యే గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహిస్తామని సర్వే ద్వారా ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించి కేంద్రానికి నివేదిక సమర్పించడంతో పాటు ముంపు ప్రాంతాల్లో రక్షణ చర్యలపై కూడా నివేదికలో పొందుపర్చనున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో వార్డుసభ్యులు భజన పెదనాగం, తోకల శ్రీనివాస్, అఖిలపక్షం నాయకులు లక్కోజి విష్ణువర్ధన్, కేవీ.రమణ, కైపు శ్రీనివాసరెడ్డి, గుద్దేటి ప్రవీణ్, వీవీబీ. చారి, అశిక్, దస్సీరామ్, పున్నంచంద్, హరినాథ్, గూడూరు వెంకన్న, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, మున్నా తదితరులు ఉన్నారు.




## ఇరవెండి పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

### గ్రామసభలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి

**బూర్గంపహాడ్ జూన్ 04 (జనంసాక్షి)**

ప్రజా సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషిచేస్తున్నట్లు జడ్పీ సీఈవో నాగలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో సర్పంచ్ గుండి బాబూరావు అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్పీ సీఈవో నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రధానంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపికకు సంబంధించి గ్రామసభలో పాలకవర్గం తీర్మానం చేయడంతో పాటు తడి, పొడి చెత్తలో నాలుగు రకాలు ఎలా వేరుచేయాలో ప్రజలకు అవగాహన కల్పించారు. మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామసభలో చర్చించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి నేరుగా తెలుసుకుని పరిష్కారానికి ఆయా శాఖల అధికారులను తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల మెరుగుదల సంక్షేమ పథకాల అమలు అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జడ్పీ సీఈవో నాగలక్ష్మిని సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ గ్రామసభలో మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, వ్యవసాయశాఖ, ఐసీడీఎస్, మిషన్ భగీరథ, విద్యాశాఖకు చెందిన అధికారులు, ఉపాధ్యాయులతో పాటు అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, వీఆర్వో, ఆశాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

### - ఎమ్మెల్యేకు సర్పంచ్, ఉపసర్పంచ్ ల వినతి



**బూర్గంపహాడ్ జూన్ 04 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బుర్గంపహాడ్ మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీలో నెలకొన్న మౌలిక సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును గురువారం క్యాంపు కార్యాలయంలో కలిసి సర్పంచ్ తాటి వాణి, ఉపసర్పంచ్ మోహనరావులు వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో అభివృద్ధి పనులు, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర ప్రజోపయోగకరమైన సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పాయం అధికారులతో మాట్లాడి పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పదం రాజు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి రెవిన్యూ కార్యాలయం లో

# దరఖాస్తులకు మోక్షం కలిగేది ఎప్పుడు..?

✧పొలం లేని వారికీ రైతు భరోసా.. పొలం వున్నవారి నెత్తిన గుది బండా

✧సెర్వేయర్లు సెర్వేకి రారు పాసుబుక్ లో ఎక్కించాలి , తీసివేయాలి అన్న మాకు అధికారం లేదు అంటూ రైతు భరోసా రాభందుల పలావుతున్న పట్టించుకొని రెవిన్యూ అధికారులు..

**నేలకొండపల్లి, మే03, (జనం సాక్షి ) :**

స్థానిక నేలకొండపల్లి మండలం లో గతంలో గ్రామ సభలో దరఖాస్తులకు మోక్షం లేదు, నిన్న ప్రజాపాలన దరఖాస్తులకు గాలికొదిలేశారు, ఇప్పుడు ప్రజాధర్బార్ లో దరఖాస్తు చేసుకోవాలి అని నిబంధనలపేరుతో రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పికుంటున్నారే తప్ప దరఖాస్తు లను పరిష్కారం చేయకుండా, సెర్వేయరులు సెర్వే చేయకుండా కావాలనే జాప్యం చేస్తున్నారని రెవిన్యూ అధికారులపై నేలకొండపల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేసున్నారు.తెలంగాణ ప్రభుత్వం గ్రామ పాలనా, ప్రజాపాలన, ప్రజాదర్బార్ ఇలా రకరకాల పేర్లతో రైతు ల వద్దనుండి దరఖాస్తులు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను ఆదేశించిన అందుకు తాగునమ్మాఅని రైతుల అర్జీలను పరిష్కారం చూపటం లో మరీ ముఖ్యంగా నేలకొండపల్లి రెవిన్యూ అధికారులు విఫలం అవుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పుడు ప్రజాధర్బార్రే కాదు ఇంకా ఏవిపెట్టిన రైతుల దరఖాస్తులురోజురోజుకి పెరుగుతూ రెవిన్యూ కార్యాలయం జాతరల మారుతుంది. సెర్వేకోసం రోలర్లు అన్నారు, కొండపల్లి రెవిన్యూ లో రోజుకు ఎన్ని సెర్వేలు చేస్తున్నారు, గతం లో చేస్తున్న దరఖాస్తులకు సెర్వేలు చేయకుండా దరఖాస్తులు గుట్టలు గుట్టలుగా పేరుకు పోతున్నాయి తప్పా, సెర్వే కి రావటం లేదని రైతులు రెవిన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలం లేని రైతులకు రైతు భరోసా, పొలం ఉన్నరైతుల నెత్తిన గుదిబండపెడుతున్నారు. ఇక సెర్వేయర్లు ఐతే ఇంకో ఆకు ఎక్కువేతిన్నారు, పొలం సెర్వే చేసిన పాసుబుక్ లో ఎక్కించాలి, లేనివారికి తీసివేయాలి అన్న మా చేతిలోఅధికారం లేదు అంటూ సెర్వే కి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కానీ ప్రభుత్వం రైతులు రెవిన్యూ ఆఫీస్ చుట్టూ తిరగాల్సిన పని లేదు రెవిన్యూ అధికారులు మీ వద్దకే వచ్చి సమస్యలు పరిష్కారి స్తారు అని గొప్పలు చెబుతున్నారు. సాధాబైనా దరఖాస్తులు, ఖీఖీ ప్రాబ్లెమ్ వున్నా దరఖాస్తులు గాలికొదిలేసారు.కొన్ని పొలం సమస్యలు పరిష్కారం చూపటం లో రెవిన్యూ అధికారులు మా చేతిలో లేదంటూ, చేతులు ఎత్తి దాటావేసున్నారు. పొలం లేని రైతులకు రైతుభరోసా వృధాపాలు అవుతున్నా ౧ంతుభరోసా ఆపటం మా చేతిలోలేదు అని తక్షిణం పరిష్కారం చూపటం లో వ్యవసాయ శాఖ అధికారులు మీమాంస లెక్కిసు _న్నారు. ఇకనైనను పొలం లేని రైతులకు రైతు భరోసా ఆపుచేసి పొలం ఉన్నరైతులకు పాసుబుక్ లో ఎక్కించి ప్రజాధర్బార్ దరఖాస్తులకు పరిష్కారం చూపేందుకు కలెక్టర్ చొరవతీసుకొని వెంటనే సమస్యలు పరిష్కరించాలని నేలకొండపల్లి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 41వ వార్డులో పంపిణీ

**నల్లగొండ ప్రతినిధి,జూన్ 05,(జనం సాక్షి):**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నల్గొండ నగరంలోని 41వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళల సంక్షేమం కోసం చేపడుతున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వారికి ఆర్థికంగా

# గ్రామాల్లో ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**○ఇందిరమ్మ ఇళ్లకు నోసుకొని పట్టణ ప్రజలు ○నియోజకవర్గంలో 1805 ఇందిరమ్మ ఇళ్లు పూర్తి**

**మధిర, మే 04 (జనంసాక్షి)**
పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం మధిర నియోజకవర్గంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి తొలి విడతలో 3000 గృహాలను మంజూరు చేశారు. దీంతో నియోజకవర్గంలో తొలి విడతలో 2,720 గృహాలను మంజూరు. వివిధ కారణాలతో 280 ఇల్లు మంజూరు నిలిచిపోయాయి. మధిర నియోజకవర్గంలో తొలి విడతలో మంజూరైన గృహాలలో 1,805 ఇళ్ల పూర్తయినట్లు గృహ నిర్మాణ శాఖ అధికారి తెలిపారు. కేవలం 101 మాత్రమే ఇంతవరకు ప్రారంభం కాలేదని, 53 ఇళ్లకు ముగ్గులు పోయడం జరిగింది. 208 గృహాలు బేస్మెంట్ లెవల్లో ఉండగా 103 గృహాలు గోడలు పూర్తయ్యాయి 450 గృహాలు స్లాబ్ లెవల్ కు రావడం జరిగింది. కొన్ని గృహాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మొదటి విడత నిధులు విడుదలైన ప్రాంతాల్లో కూడా నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల, కూలీల కొరత, అదనపు ఆర్థిక భారం కారణంగా కొంతమంది పేదలు గృహ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచి పోతున్నాయి.



కొందరు లబ్ధిదారులు అప్పులు చేసి పనులు ప్రారంభించినా, తదుపరి విడత నిధుల విడుదల ఆలస్యం కావడంతో నిర్మాణాలను పూర్తి చేయలేక పోతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పరిస్థితిపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం త్వరితగతిన నిధులు విడుదల చేసి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు. మరోవైపు అధికారులు మాత్రం నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా నిధులు అందజేస్తున్నామని చెబుతున్నారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. గత మూడు నెలల నుండి ఫైనల్ బిల్లు మంజూరులో కొంత జాప్యం జరిగింది. మొత్తం మొత్తం మీద మధిర నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పురోగతి ప్రభుత్వ లెక్కల ప్రకారం చాలా బాగుందని అధికారులు చెబుతున్నారు. ఇది ఇలా ఉండగా తొలి విడతలో మధిర మున్సిపాలిటీలో ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయలేదు. దీంతో పట్టణంలో ఉన్న పేదలు ఇందరమ్మ ఇల్లు కోసం ఎదురుచూస్తున్నారు. రెండో విడతలోనైనా మధిర మున్సిపాలిటీలో ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయా? లేదా? అని ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.




# సాగర్ బ్రిడ్జి నిర్మించండి - బోగ్గువీటి సరళ

**రాబోయే కాలంలో బ్రిడ్జి కోసం దశల వారీగా ఆందోళన**

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 4 ( జనంసాక్షి )**
సిపిఎం పార్టీ ఖానాపూరం హవేలీ ఆధ్వర్యంలో టేకులపల్లి డబుల్ బెడ్ రూం క్వార్టర్స్ నుంచి శ్రీ లక్ష్మి నగర్ రోడ్ నెంబర్ 32 రహదారి మీదుగా శ్రీ శ్రీ సర్కిల్ వరకు సాగర్ కాల్వ పై వెంటనే బ్రిడ్జి నిర్మించి స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అఖిఓ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బోగ్గువీటి సరళ డిమాండ్ చేశారు. పార్టీ బృందం గురువారం పర్యటన చేసి ప్రజల దగ్గర సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బోగ్గువీటి సరళ మాట్లాడుతూ ఏడో డివిజన్ పరిధిలోని కెసిఆర్ టవర్ లో గత ప్రభుత్వం నిరుపేదలకు 1200 కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చారు అని తెలిపారు. వారికి అక్కడ సరైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారు అని వివరించారు. వారికి మౌలిక వసతుల్లో భాగంగా కనీసం త్రాగు నీరు సౌకర్యం కూడా సరిగ్గా లేదు అని ఆరోపించారు. వేసవి కాలం అవడంతో ఈ సమస్య మరింత పెరిగి చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపారు. వాటర్ సమస్యపై కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా కూడా చేశామని చెప్పారు. ఓవర్ ట్యాంక్ లు ఏర్పాటు చేసి కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలి త్రాగు నీరు సౌకర్యం రోజూ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ ప్రాంత ప్రజలు బైపాస్ రోడ్ కు రావాలంటే చుట్టూ తిరిగి టేకులపల్లి బ్రిడ్జి మీదుగా రావాల్సిన పరిస్థితి ఏర్పడింది అని, ఈ సమస్య ను దృష్టిలో ఉంచుకుని డైరెక్టర్ గా బైపాస్ రోడ్ కు నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా ఆందోళన లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డబుల్ బెడ్ రూం క్వార్టర్స్ నుంచి శ్రీలక్ష్మి నగర్ 32 రహదారి మీదుగా శ్రీ శ్రీ సర్కిల్ వరకు సాగర్ కాల్వ పై నూతన బ్రిడ్జి నిర్మించడం వల్ల డబల్ బెడ్ రూమ్స్ లో నివసిస్తున్న ఐదువేల జనాభాకి అట్లాగే శ్రీ లక్ష్మీనగర్ లో నివాసం ఉంటున్న ప్రజలకు, మరియు చుట్టుపక్కల ప్రజలకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. తక్షనమే బ్రిడ్జి నిర్మించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రి , కార్పొరేషన్ కమిషనర్ చొరవ తీసుకుని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు




# కల్లూరు మండలంలో ఉత్సాహంగా ప్రారంభమైన గ్రామ వార్డు సభలు

**కల్లూరుజూన్ 04(జనం సాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టినప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక లో భాగంగా కల్లూరు మండలంలోని అన్ని పంచాయతీలలో మున్సిపాలిటీలోని వార్డులలో ఉత్సాహంగా గ్రామసభలు గురువారం నిర్వహించారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 7 వార్డు హనుమ తండా గ్రామం నందు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏడవ వార్డు కౌన్సిలర్, కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ అధ్యక్షతన వార్డు సభ నిర్వహించడం జరిగింది. ఈకల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు . రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి వివరించి వచ్చే వర్షాకాలం ని దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ప్రజలకు సూచనలు చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రెండో విడత ఇందిరమ్మ గృహాలు మంజూరు ప్రక్రియని ముమ్మరం చేసిందని అన్నారు. కొత్త పెన్షన్లు కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరావు అగ్రికల్చర్ ఆఫీసర్ మాదాబత్తుల రూప హౌసింగ్ శాఖ అధికారులు, వెటర్నరీ డాక్టర్ మమత ఎలక్ట్రికల్ ఎస్ ఎల్ ఐ రవి ట్రైబల్ డిపార్ట్మెంట్ శ్రీనివాస్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆశలత హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు, మెప్మా టీంమెంబర్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్ సరోజినీ , కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరావత్ బాలు గుగులోతు గోబ్రియ కునుసోత్ రవి , జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవికుమార్ , గ్రామ ప్రజలు, మున్సిపాలిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రారంభమైన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"

### 99 రోజుల కార్యాచరణ వార్డు సభలు

**చండూరు, జూన్ 04 (జనంసాక్షి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం చండూరు పట్టణంలోని స్థానిక పీ.ఆర్ గెస్ట్ హౌస్ నందు పర్యావరణ వారోత్సవము కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 4, 6, 8 మరియు 10వ తేదీలలో నిర్వహించాల్సిన వార్డు సభల షెడ్యూల్లో భాగంగా.. ఈరోజు మొదటి వార్డు సభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, 10వ వార్డు కౌన్సిలర్ కటకం రమేష్, వార్డు అధికారులు ఏ. జగన్ (6వ వార్డు), జి. శ్రీరాములు (10వ వార్డు) ల ఆధ్వర్యంలో ఈ సభ అత్యంత విజయవంతంగా జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్పర్సన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణ మరియు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ వ్యాప్తంగా ప్రత్యేక సన్నద్ధత చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా శిథిలావస్థకు చేరిన ఇండ్ల తొలగింపు, రోడ్ల వెంట నీరు నిల్వ ఉండకుండా చూడటం, మురికి కాలువల పూడికతీత, పిచ్చిమొక్కలు (కంపచెట్లు) తొలగించే పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో.. పట్టణ ప్రజలందరూ తాగునీటిని ఎంతో పొదుపుగా వాడుకోవాలని, భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 10వ వార్డు కౌన్సిలర్ కటకం రమేష్ మాట్లాడుతూ.. ఇటీవల వార్డులో పెద్ద ఎత్తున కంపచెట్ల తొలగింపు ప్రక్రియతో పాటు నూతన వీధి దీపాల ఏర్పాటును పూర్తి చేశామన్నారు. ప్రజలు కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా, మున్సిపల్ వాహనాలకే అందించాలని, పరిసరాల పరిశుభ్రత విషయంలో స్థానికులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ సందర్భంగా ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ప్రగతి ప్రణాళిక ముఖాముఖి కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాములు, కో-ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళమారయ్య, షేక్ ఖలీల్, ఎండీ సలీమా షరీఫ్, వార్డు అధికారులు జి. శ్రీరాములు, ఎ. జగన్, బి. సాయిరాం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు, ఆర్పీలు,వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ప్రజా పాలనలో ప్రగతి ప్రణాళికలతో**

# పరిష్కారమైన సమస్యలు

**నాలుగోవ వార్డు సభలో మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత**

**మధిర, జూన్ 04 (జనంసాక్షి) :**
ప్రజా పాలనలో ప్రగతి ప్రణాళికలతో మధిర పట్టణంలో అనేక సమస్యలు పరిష్కరించడం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం నాలుగవ వార్డు ఇల్లెందులపాడులో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ బెనటిక్




ఇజ్రాయెల్ పాల్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, మున్సిపాలిటీలలో పారిశుధ్యం,వర్షాకాలంలో ముంపు సమస్యలు,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టామని అన్నారు. మున్సిపాలిటీలో ఇప్పటికే అనేక సమస్యలు గుర్తించి పరిష్కరించామని తెలిపారు. వచ్చే వర్షాకాల సీజన్ ని దృష్టిలో ఉంచుకొని వర్షపు నీరు సాఫీగా పోయేలా మురుగునీటి కాలువలు, నాలాల్లో పేరుకుపోయిన పూడిక,చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో పొంగిపొర్లే మురుగు కాలువలను గుర్తించి,పగిలిన మ్యాన్‌హోల్స్‌కు పటిష్టమైన మూతలు మార్పు వంటి కార్యక్రమాలు చేపట్టామనితెలిపారు. అలాగే తడి-పొడి చెత్త వేరుచేసే ప్రక్రియపై పట్టణ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,వార్డు పెద్దలు సూర్యదేవర కోటేశ్వరరావు,సామినేని రామనాథం, వాసిరెడ్డి నాగేశ్వరరావు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## దుగ్యాల శివారులో బత్తాయి చెట్లు దగ్ధం

### ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

**పి.ఏ.పల్లి,జూన్ 04(జనంసాక్షి):**
పి.ఏ.పల్లి గ్రామానికి చెందిన ఏరుకొండ లింగయ్య, గణపురం సంతోష్ కుమార్,నారాయణదాస్ యాదగిరి లకు చెందిన బత్తాయి తోటలోని చెట్లు దహనమయ్యాయి. ఏరుకొండ లింగయ్య కు చెందిన సుమారు 60 చెట్ల చొప్పున,గణపురం సంతోష్ కుమార్ కు చెందిన 35 చెట్లు,యాదగిరి కి చెందిన 30 చెట్లు పూర్తిగా దహనమయ్యాయి. ఎండాకాలం కావడంతో వీరి తోటల పైన వరి పొలాలలో వరి కొయ్యలకు నిప్పు అంటుకొని అకస్మాత్తుగా మంటలు చెలరేగి గణపురం వెంకటయ్య కు చెందిన 2.మోటారు స్టార్టర్ పెట్టెలు పూర్తిగా కాలిపోయాయి.బాధిత రైతులు ప్రభుత్వపరంగా సహాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఫైర్ ఇంజన్ తో మంటలను చాలార్చారు.

## రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు

### మండల వ్యవసాయ అధికారి షేక్ జావిద్

**నేరేడుచర్ల (జనంసాక్షి)**
రైతులకు జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని నేరేడుచర్ల మండల వ్యవసాయ అధికారి షేక్ జావిద్ గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు.పచ్చి రొట్టె ఎరువైన జీలుగు విత్తనాలను వానకాలం సీజన్ లో రైతులకు 50% శాతం రాయితితో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. పచ్చిరొట్టె ఎరువుగా జీలుగు సాగు చేయడం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరుగుతుందని, రసాయన ఎరువుల వాడకం తగ్గి ఖర్చు తగ్గుతుందన్నారు. పంట దిగుబడి పెరుగుతుందని,మట్టిలో సూక్ష్మ జీవాల సంఖ్య పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.భూమి గట్టిదనం తగ్గి మెత్త బడి నేలలో నైట్రోజన్ స్థాయి పెరగటం తదితర ప్రయోజనాలు ఉంటాయన్నారు. జీలుగు విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాసు బుక్కు జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని మండల వ్యవసాయాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.30 కేజీల జీలుగు బస్తా ధర రూ.4,905 రూపాయలు కాగా,50% రాయితీ తో రైతులకు రూ.2452.50 రూపాయలుగా అందుబాటులో ఉందన్నారు.30 కిలోల జీలుగు సుమారు 2, 2.5 ఎకరాల విస్తీర్ణానికి సరిపోతుందన్నారు.

## బాసర ఐ ఐ ఐటీ కి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపిక





**మణుగూరు, జూన్ 04 (జనంసాక్షి):**
ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందిస్తోందని పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని మరోసారి నిరూపించారనీ మణుగూరు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ నాగశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణుగూరు ప్రభుత్వ జెడ్ పి హెచ్ ఎస్ కో ఎడ్యుకేషన్ పాఠశాల నుండి 2026 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బాసర ఐఐటి కి ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయ్యారని తెలిపారు 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో గంజి జీష్మరమణిక 565 జె వికాస్ 563 అత్యధిక మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు . ఏజెన్సీ ప్రాంతం నుండి పదవ తరగతి లో విద్యార్థుల ప్రతిభ ఉపాధ్యాయుల శిక్షణ బాసర ఐఐటీకి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని తెలిపారు ఈ సందర్భంగా ఇంతటి విజయానికి కారకులైన ఉపాధ్యాయులను తల్లిదండ్రులను అభినందించారు. ఈ విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలని భవిష్యత్తులో మరిన్ని విజయాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



## టీయూడబ్ల్యూజే, ప్రెస్ క్లబ్ బాధ్యుల నియామకం

**హాలియా, జూన్ 4 జనంసాక్షి:**
టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీతో పాటు అనుబంధ నల్లగొండ ప్రెస్ క్లబ్‌లో పలు పదవులకు నియామకాలు చేపట్టారు. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు హాలియాకు చెందిన వద్దిరెడ్డి వెంకట్ రెడ్డిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. నల్లగొండ ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శిగా నామా లింగయ్యను ఎంపిక చేశారు. హాలియా మండల అధ్యక్షుడిగా సముద్రాల దామోదర్, మండల ప్రధాన కార్యదర్శిగా ఎండి కరీంను నియమించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులకు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన బాధ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

# రైతులను అన్ని రకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుంది

### మంగలి తండా నుండి బుగ్గ లిఫ్ట్ కు వెళ్లే రహదారికి రాంరెడ్డి గోపాల్ రెడ్డి శంకుస్థాపన

**కామేపల్లి,జూన్ 4 (జనంసాక్షి):**
రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి అన్నారు. ఎంతోకాలం నుండి మండలంలోని గోవింద్రాల గ్రామానికి చెందిన రైతులు రైతులను ఆదుకోవడంలో ముందుండి సమస్య పరిష్కరించడంలో చొరవ చూపారు మంగలి తండా నుండి బుగ్గ వాగు లిఫ్ట్ ఇరిగేషన్ వరకు తమ పంట పొలాలకు వెళ్లాలంటే సరైన రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.దీంతో గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు కలిసి సమస్యను గుర్తించి గురువారం మంగళి తండ నుండి బుగ్గ వాగు లిఫ్ట్ వరకు ఫార్మేషన్ రహదారి నిర్మించడానికి గ్రామపంచాయతీ సాధారణ నిధులను కేటాయించింది.రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మేషన్ రహదారి నిర్మాణంతో ఈ ప్రాంత రైతుల కష్టాలు తీరనున్నాయని అన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ ప్రజా పాలన



ఇందిరమ్మ ప్రభుత్వం అండగా నిలుస్తుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గోవింద్రాల సర్పంచ్ బానోత్ కమలా -దేవయ్య,ఉప సర్పంచ్ ఆలోత్ తార- శివ,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆలోత్ లక్కు, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు బానోత్ బద్రి- లాల, లకావత్ సునీత - లక్ష్మీనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ,కాంగ్రెస్ నాయకులు హట్కర్ రాంబాబు,ఆలోత్ మోహన్, లావుడియా వినోద్. దాస్య.బాసు. లాకావత్ వీరన్న, ప్రేమ్. గ్రామ పంచాయతీవారుసభ్యులుతదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్ల తో ఆయిల్ ఫామ్ రైతులు విలవిల

**పాలేరు.జూన్.(3). జనంసాక్షి**
ఆయిల్.ఫామ్ రైతులు పంట సాగు చేశారు తోటల్లో నుంచి పోయే విద్యుత్. లైన్ల తో విలవిల లాడుతున్నా రు. ముందు రైతులకు అవగాహన లేదు తీరా పంట.చేతికి.వచ్చాక. చెట్లు విద్యుత్ లైన్ల కు.అనటం. చెట్లు మొగిలి.కాలి. పోవడం జరగటం వలన. రోజు నీళ్ళు పెట్టటం వల్ల గెలలు.కొట్టే.తప్పుడు. విద్యుత్ షాక్. వచ్చే ప్రమాదం ఉన్నదని రైతులు బెంబేలెత్తుతున్నారు అదికాక. విద్యుత్ షాట్.సర్క్యూట్.వల్ల తోటలో.ఉండే. ఎండు మట్టాలకు. అంటుకుని తోటలు కాలిపోయే ప్రమాదం. ఉన్నది ఒక్కో లైనుకు.మూడు. వరసలు చెట్లకు లైన్ ఎంత దూరం పోతే. అంత దూరం చెట్లకు షాక్.వచ్చే. ప్రమాదం వున్నది చెట్లు అన కున్న విద్యుత్ లైన్లు ఒక్కోసారి లైన్ల కేట్ కావడం. ఇన్సేటర్లు. కాలిపోయి. కాసరం. మీద పడి విద్యుత్మంటలు వచ్చి. తోటలు. కాలిపోయే. ప్రమాదం ఉన్నందున విద్యుత్ లైన్లు తోటల్లో ఉన్నవి పక్కకుమార్చాలని రైతులు అభ్యర్ధిస్తున్నారు విద్యుత్ లైన్లు ప్రభుత్వం మార్చలే. కానీ రైతులు లక్షలు పెట్టి.మార్చలేమాని నోటికాడికి వచ్చిన పంటను వదులు కోలేమని ప్రభుత్వంను. విద్యుత్ అధికారులను మొరపెట్టుకుంటూ. న రైతులు



## రానున్న వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### అంగడిపేట సర్పంచ్ చిరంజీవి

**పి.ఏ.పల్లి,జూన్ 04 (జనంసాక్షి)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఉదయం 10 గంటలకు అంగడిపేట సర్పంచ్ రమావత్ చిరంజీవి అధ్యక్షన ప్రజా పాలన - ప్రగతి ప్రాణాలిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు.ఈ గ్రామ సభకు స్థానిక స్పెషల్ ఆఫీసర్ చంద్రమౌళి హాజరై గ్రామ ప్రజలకు త్రాగునీరు సమస్య, వర్షాకాలం ముందస్తు జాగ్రత్తలు, ఘన వ్యర్థాలు ,జల సంరక్షణ, హరితహారం,వ్యవసాయ పంటలపై వైవిధ్యకారణ, ముందస్తు వర్షాకాలంలో విద్యుత్ పై అవగాహన గురించి గ్రామసభలో గ్రామ ప్రజలకు వివరించారు. అదే విధంగా అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద చెత్త విషయంలో తడి చెత్త,పొడి చెత్త వేరు చేసే దాని గురించి మరియు శానిటేషన్ విష పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువులు వాడకం పూర్తిగా తగ్గించాలంటూ ప్రజలలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ,వివిధ హోదాల అధికారులు,గ్రామ ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు పాల్గొనారు.







అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక నేతలపై మర్రిగూడ మండలంలో భూదందాలు, అధికార దుర్వినియోగం, జర్నలిస్టులకు బెదిరింపుల ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. అజిలాపురం, రాంరెడ్డిపల్లి భూ వివాదాల్లో వారి ప్రమేయం ఉందని బాధితులు ఆరోపిస్తుండగా, ఈ వ్యవహారాలను వెలుగులోకి తెస్తున్న రిపోర్టర్లను సైతం బెదిరిస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతుండగా, ఈ పరిణామాలపై సొంత పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది.



# అధికారం ముందు...న్యాయం ఒడిపోయిందా?

## ఎమ్మెల్యే చెప్పినోళ్లకే న్యాయమా?

- “రిపోర్టర్లను చంపుతాం” అంటూ బహిరంగ సవాల్
- మర్రిగూడలో నేతల భూదందాలు, హత్యా బెదిరింపులు
- 80 ఏళ్ల వృద్ధురాలి 20 ఎకరాల భూమి కన్నేసిన నేతలు
- సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత, ఎమ్మెల్యే జోక్యం కోరుతున్నారు

మర్రిగూడ, జూన్ 4 (జనంసాక్షి):

మర్రిగూడ మండలంలో భూవివాదాలకు సంబంధించిన ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక నాయకులు భూ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ బాధితులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని కొందరు వ్యక్తులు వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాలపై అధికార పార్టీ వర్గాల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

యరుగండ్లపల్లి రెవెన్యూ పరిధిలోని అజిలాపురం గ్రామంలో సర్వే నంబర్లు 303, 305లో ఉన్న సుమారు 20 ఎకరాల భూమికి సంబంధించి వివాదం కొనసాగుతోంది. ఈ భూమిపై కొందరు నేతలు కన్నేశారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. కుటుంబ పరిస్థితులను ఆసరాగా చేసుకుని తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని వృద్ధురాలు రాజ్యలక్ష్మి ఆరోపిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అజిలాపురం వివాదం కొనసాగుతుండగానే రాంరెడ్డిపల్లి ప్రాంతంలో మరో భూ వివాదంలోనూ అదే నాయకుల ప్రమేయం ఉందనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ విషయంపై స్థానికంగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. సంబంధిత వ్యవహారాలపై విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కొందరు గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

భూవివాదాలకు సంబంధించిన అంశాల్లో అధికార యంత్రాంగంపై ఒత్తిళ్లు తెస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. సివిల్ వివాదాల పరిష్కారంలో అనవసర జోక్యం పెరుగుతోందని కొందరు ఆరోపిస్తున్నారు. తమ భూములకు రక్షణ కల్పించడంతో పాటు చట్టపరమైన హక్కులను కాపాడాలని బాధితులు కోరుతున్నారు.

మరోవైపు ఈ అంశాలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రిపోర్టర్లకు బెదిరింపులు వస్తున్నాయని జర్నలిస్టు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను సహించబోమని వారు హెచ్చరిస్తున్నారు.

ఈ పరిణామాలపై అధికార పార్టీ స్థానిక నాయకుల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతల వ్యవహార శైలి కారణంగా పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని సీనియర్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పరిస్థితి మరింత దిగజారకముందే పార్టీ అధిష్ఠానం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఆరోపణలపై వాస్తవాలను వెలికితీయాలని వారు కోరుతున్నారు. భూవివాదాలు, జర్నలిస్టులపై బెదిరింపుల ఆరోపణలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజాసంఘాలు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఆరోపణలపై అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# మర్రిగూడ అభివృద్ధి శాఖలో అరాచకం

## మర్రిగూడ అభివృద్ధి శాఖలో అక్రమాల ఆరోపణలు

- మంత్లీ పేమెంట్ లేకుండా ఫైళ్లు కదలవన్న విమర్శలు
- ఇందిరమ్మ ఇళ్లు, జీపీ బిల్లులు, డిపాజిట్లపై ప్రశ్నలు
- సర్పంచ్‌లు, సిబ్బందిలో పెరుగుతున్న అసంతృప్తి
- ఎన్నికల నిధుల పంపిణీపై అనుమానాలు
- విచారణ జరిపించాలని ప్రజాప్రతినిధుల డిమాండ్




**మర్రిగూడ, జూన్ 4 (జనంసాక్షి):** మర్రిగూడ మండల అభివృద్ధి శాఖ పనితీరుపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు జరగాలంటే నెలవారీ చెల్లింపులు తప్పనిసరి అన్న భావనను కొందరు అధికారులు కల్పిస్తున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఫైళ్లు ముందుకు కదలాలంటే అనధికార చెల్లింపులు చేయాల్సి వస్తోందని, లేకుంటే నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులపై మండల వ్యాప్తంగా చర్చ సాగుతోంది మండలంలోని ఇద్దరు కీలక అధికారుల వ్యవహార శైలిపై పలువురు సర్పంచ్‌లు, గ్రామస్థాయి నాయకులు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అధికారులతో సహకరించని వారిపై నోటీసులు, వివరణలు, పరిపాలనా ఒత్తిడులు పెరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. కొంతమంది గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఫైళ్లు ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తున్నారని కూడా వాదిస్తున్నారు.

ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన సిబ్బందికి సంబంధించిన నిర్వహణ నిధుల పంపిణీపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి అందాల్సిన మొత్తంలో పూర్తి పారదర్శకత పాటించలేదని కొందరు ఆరోపిస్తున్నారు. ఒక్కో వార్డుకు పరిమిత మొత్తమే అందించగా, మిగిలిన నిధుల వివరాలపై స్పష్టత లేదని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు కేటాయించిన నిధుల వినియోగంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సిబ్బందికి చెల్లించాల్సిన పారితోషికం ఇప్పటివరకు అందలేదని సమాచారం. సంబంధిత నిధులు విడుదలైనట్లు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనిచేసిన వారికి వాటి ప్రయోజనం అందలేదని కొందరు సిబ్బంది వాపోతున్నారు. దీంతో ఆ నిధుల పంపిణీ ప్రక్రియపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు చెల్లించిన డిపాజిట్ మొత్తాల వ్యవహారంపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత నిధులు ఖజానా ఖాతాలకు పూర్తిగా జమయ్యాయా లేదా అన్న అంశంపై స్పష్టత కోరుతున్నారు. డిపాజిట్ మొత్తాల లెక్కలు బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల వ్యవహారంలోనూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్లులు ఆమోదం పొందాలంటే మధ్యవర్తిత్వం లేదా అనధికార చెల్లింపులు అవసరమవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈ కారణంగా పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉండటంతో గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెబుతున్నారు.

మరోవైపు కొందరు అధికారులు డివిజన్ స్థాయి అధికారులతో సన్నిహిత సంబంధాలను ఉపయోగించుకొని తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు నిరాశ వ్యక్తం చేస్తున్నారని సమాచారం. అధికార వ్యవస్థలో సమతుల్యత దెబ్బతింటోందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఉద్యోగుల బదిలీలు, డిప్యూటేషన్‌ల వ్యవహారంలోనూ పారదర్శకత లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాళీలు లేకపోయినా కొందరిని ప్రత్యేకంగా డిప్యూటేషన్‌పై తీసుకువస్తున్నారని, సాధారణ బదిలీల ప్రక్రియ ప్రారంభం కాకముందే అనుకూల వ్యక్తులను కీలక స్థానాల్లో నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో మర్రిగూడ మండల అభివృద్ధి శాఖలో జరుగుతున్న ఆర్థిక, పరిపాలనా వ్యవహారాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, స్థానికులు కోరుతున్నారు. ప్రజాధనం వినియోగం, పథకాల అమలు, బిల్లుల చెల్లింపులు, డిపాజిట్ నిధుల నిర్వహణ తదితర అంశాలపై పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో నిజానిజాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో విశ్వాసం పునరుద్ధరించబడుతుందని అభిప్రాయపడుతున్నారు.